ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.2, కనిష్ఠం 24.6



5
కామారెడ్డి
జిల్లా వార్తలు
ఆదివారం 14 ఏప్రిల్ 2024

సమ్మర్ యోగా క్యాంప్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13: జిల్లా కేంద్రంలోని లిటిల్‌స్కాలర్స్ హైస్కూల్‌లో ఆదియోగ పరమేశ్వర యోగ ఫౌండేషన్, యోగ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ యోగా క్యాంపును నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు భరత్ తెలిపారు. ఇందులో యమ, నియమ, ఆసనా, ప్రాణాయామ, ప్రతిహార, ద్వారానా, ఆస్తయ, అపరిగ్రహ, ఈశ్వర ప్రవిధాన, స్వాధ్యాయ, సమాధి మొదలగు అంశాలపైన యోగా శిక్షణ ఉంటుందని తెలిపారు. మిగిలిన వివరాలకు 83338 55845 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



బాన్సువాడలో తడిసిన ధాన్యం

పెద్దకొడప్‌గల్‌లో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

అకాల వర్షంతో..
తడిసిన ధాన్యం

కామారెడ్డి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులను కారుమబ్బులు భయపెడుతున్నాయి. ఆకాశమంతా కారు మబ్బులు కమ్మేయడంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. కేంద్రాల్లోని వరి ధాన్యం పంట పొలాల్లోని వరిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలోని బాన్సువాడ డివిజన్ పరిధిలో అకాల వర్షాలు కురువడంతో ధాన్యం తడిసి పోవడం వల్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు జిల్లాలో ధాన్యం కొనుగోల్లు పూర్తిస్థాయిలో తెరుచుకున్నా కేంద్రాల్లో కొనుగోళ్లు మాత్రం మొదలుకావడం లేదు. ఇప్పుడిప్పుడే రైతులు భారీగా ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో అకాల వర్షాలు కురిస్తే ఎక్కడ తడిసి పోతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేసి తరలించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 103 కేంద్రాల్లో 15వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

- జిల్లాను కమ్మేస్తున్న కారు మబ్బులు
- పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలు
- కొనుగోలు కేంద్రాల్లో, పంట పొలాల్లో తడిసిన ధాన్యం
- పూర్తిస్థాయిలో తెరుచుకోని కొనుగోలు కేంద్రాలు
- ప్రారంభమైన కేంద్రాల్లో జరగని కొనుగోళ్లు
- కేంద్రాల్లో కుప్పలు తెప్పలుగా ధాన్యం రాశులు
- ఇప్పటి వరకు 15వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోళ్లు

అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం

జిల్లాలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, బిచ్కుంద, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నుంచి అకాల వర్షాలు కురువడంతో కొనుగోలు కేంద్రాల్లో, పంట పొలాల్లోని వరి ధాన్యం తడిచిపోయింది. మార్కెట్ యార్డులలో కుప్పలు తెప్పలుగా రైతులు ధాన్యం రాశులను పోసి ఉంచారు. ఒక్కసారిగా వర్షాలు కురువడంతో ధాన్యం వర్షం పాలైంది. తడిచిన ధాన్యాన్ని కేంద్రం నిర్వాహకులు కొంటారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వేలాది ఎకరాల్లో వరి కోతలకు సిద్ధంగా ఉన్నాయి. అయితే అకాల వర్షాలు రైతులను భయపెడుతున్నాయి. గత 20 రోజుల కిందటే వడగండ్ల వర్షాలు వందలాది ఎకరాల్లో వరి మొక్కజొన్న, జొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వాతావరణ మార్పులు చోటు చేసుకుంటుండడం, చల్లబడడం, ఆకాశం మబ్బులతో కమ్మేయడంతో ఎక్కడ అకాల వర్షాలు కురుస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆకాశాన్ని కమ్మేస్తున్న మబ్బులు


ప్రతీ యాసంగి సీజన్‌లో కోతలు, కొనుగోళ్ల సమయంలో అకాల, వడగండ్ల వర్షం కురువడం సాధారణమే. సరిగా కోతల సమయంలోనే కురుస్తుండడంతో ప్రతిఏటా రైతుల ధాన్యం తడిసిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఆకాశాన్ని కారుమబ్బులు కమ్మేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అక్కడక్కడ అకాల వర్షాలు కురిస్తే కేంద్రాలు, పంట పొలాల్లోని ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆగమవుతున్నారు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

పరుగులు తీస్తున్న రైతులు

జిల్లాలో వాతావరణం ఉన్నట్టుండి మారి పోవడంతో కేంద్రాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీస్తున్నారు. కోతకు వచ్చిన పొలాలు గాలి దుమారానికి, వర్షానికి అడ్డం పడుతాయని రాశులు ఉన్న ధాన్యం తడిస్తుందేమోనని ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు ఏ గాలి దుమారం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటను కోసి కల్లాలు, కేంద్రాల్లో ఆరబెట్టుకున్న రైతులు కుప్పలుగా పోసి పట్టాలు పట్టుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్‌లు అందుబాటులో లేకపోవడంతో తెలిసిన వారి వద్ద కొనుగోలు చేసి ధాన్యం రాశులపై కప్పుకుంటున్నారు.

15వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఇప్పుడిప్పుడే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతున్నాయి. రైతులు సైతం ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా 343 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు 103 కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో 15వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేపట్టారు. అయితే ఈ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలించేందుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పలు రైస్‌మిల్లులకు కేటాయించారు. ఈ రైస్‌మిల్లుల్లోని ఎక్కువ మిల్లులు కామారెడ్డి డివిజన్ ప్రాంతంలో ఉండడంతో బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి డివిజన్ ప్రాంతాల నుంచి కామారెడ్డికి తరలించేందుకు కాస్తా ట్రాన్స్‌పోర్టు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.



ప్రైవేట్ వ్యాపారులతో జాగ్రత్తగా ఉండాలి



నస్రుల్లాబాద్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్

బీర్కూర్, ఏప్రిల్ 13 : రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నదాతలకు సూచించారు. శనివారం ఆయన బీర్కూర్ మండలంలోని దామరంచ, వీరాపూర్ గ్రామాలలో పర్యటించారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ళ ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి విండో సీఈవోలు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, రైతులతో ఆయన చర్చించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా కొంత మంది రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు విక్రయిస్తున్నారని ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతులు తెలిపారు. దళారులకు విక్రయించే విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోళ్ళు వేగవంతం చేయాలని సీఈవోలను ఆదేశించారు. ఆయన వెంట డీసీఎస్‌వో మల్లికార్జున బాబు, సీఈవోలు, రైతులు తదితరులు ఉన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

నసురుల్లాబాద్: అకాల వర్షాలతో రైతులు, ఇబ్బందులు శనివారం నసురుల్లాబాద్ మండలం దుర్కి, మిర్జాపూర్ గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని కామారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించారు. స్థానిక సీఈవోతో మాట్లాడుతూ తడిసిన బస్తాలను వెంటనే పంపించాలని ఆయన సూచించారు. ఈ పరిశీలనలో ఆర్‌ఐ హన్మాండ్లు, సీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న..
అక్రమ ఫైనాన్స్‌లు!

- జిల్లావ్యాప్తంగా జీరో ఫైనాన్స్‌లపై పోలీసుల కొరడా
- ఇంటి డాక్యుమెంట్‌లు, బంగారు వస్తువులను కుదువ పెట్టుకుని డబ్బులు
- వీక్లీ ఫైనాన్స్‌ల తీరు మరీ ఘోరం
- జిల్లాలో అక్రమ వడ్డీ, ఫైనాన్స్ చేస్తున్న 23 మందిపై కేసులు

భిక్కనూరు, ఏప్రిల్ 13: జిల్లావ్యాప్తంగా పల్లెటూరు, పట్టణం అని తేడా లేకుండా రోజురోజుకూ అక్రమ ఫైనాన్స్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇటీవల చాలా మంది ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ అమాయక ప్రజలు, చిరు వ్యాపారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీ వ్యాపారం చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. గ్రామాల్లో పలువురు అధిక వడ్డీ, చీటీల వ్యాపారం చేస్తూ అమాయక ప్రజలను దోచుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ఈ ఫైనాన్స్ నిర్వాహకుల చేతుల్లో చిక్కిన అమాయక ప్రజలు, చిరు వ్యాపారులు వారికి వడ్డీలు కట్టలేక చితికిపోతున్నారు. జిల్లాలో ఎక్కువగా నెల నెలా ఫైనాన్స్, వీక్లీ ఫైనాన్స్, చీటీల పేరుతో పలువురు ఈ అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఇతర వ్యాపారాలు చేసేవారు, కొందరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో పాటుగా ఇతర శాఖల్లో పనిచేసే ఉద్యోగులు గ్రూప్‌గా కలిసి, మరికొన్ని చోట్ల ఒక్కరే ఎవరితో కలవకుండా ఈ అక్రమ ఫైనాన్స్ వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. ఈ అక్రమ ఫైనాన్స్‌లకు తోడుగా కొన్ని మైక్రో ఫైనాన్స్‌లు సైతం ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ అనుమతితో కొనసాగుతున్న ఫైనాన్స్‌ల కన్నా అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహించే ఫైనాన్స్‌లే ఎక్కువగా ఉన్నాయి. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ ఫైనాన్స్‌లపై పోలీసులు ఇటీవల కొరడా జులిపిస్తున్నారు. జిల్లాలో మూకుమ్మడిగా దాడులు చేస్తూ అక్రమంగా ఫైనాన్స్‌లను నడిపిస్తున్న వారి గుండెల్లో రైలు పరుగెత్తిస్తున్నారు.

ఇంటి డాక్యుమెంట్‌లు, వాహనాల ఆర్సీలు, బంగారు వస్తువులను కుదువ పెట్టుకుని..

అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని పలువురు వడ్డీ వ్యాపారులు వారికి ఎక్కువ వడ్డీకి డబ్బులను ఇస్తున్నారు. అక్రమ ఫైనాన్స్ వ్యాపారులు ఈ డబ్బులను ఇవ్వాలంటే డబ్బులు తీసుకునేవారి ఇంటి డాక్యుమెంట్‌లను, బంగారు, వెండి ఆభరణాలను, వస్తువులను, వాహనాలకు సంబంధించిన ఆర్సీలను కుదువ పెట్టుకుంటున్నారు. తీసుకున్న డబ్బులను నిర్ణీత సమయంలో చెల్లించని యెడల, వడ్డీకి, చక్రవడ్డీ కలిపి ఇచ్చిన డబ్బుల కంటే అమాయకులు, చిరు వ్యాపారుల వద్ద దాదాపు పది రేట్ల వరకు ఎక్కువగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఒకవేళ ఇవ్వని యెడల కుదువ పెట్టుకున్న ఇళ్లను జప్తు చేసుకోవడం, వాహనాలను, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీన పర్చుకోవడం లేదంటే విక్రయించడం లాంటివి చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో అక్రమ ఫైనాన్స్‌ల బారిన పడి ఆస్తులను, ఆభరాణాలను, వాహనాలను కోల్పోయిన బాధితులు, అధిక వడ్డీ చెల్లించలేక పలువురు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు జిల్లాలో చాలా ఉన్నాయి. ఈ అక్రమ ఫైనాన్స్‌లు చేస్తున్న వారిలో చాలా వరకు సమాజంలో పేరున్న పెద్దపెద్ద వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం కొసమెరుపు.

వీక్లీ ఫైనాన్స్‌లు మరీ ఘోరం

ఇటీవల చిరు వ్యాపారులే లక్ష్యంగా పలువురు వీక్లి ఫైనాన్స్ వ్యాపారాన్ని మొదలు పెట్టారు. చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, ఇతరులకు వీక్లి ఫైనాన్స్ వ్యాపారులు రూ.10వేలు కావాలంటే ముందుగానే అందులో రూ.వెయ్యి నుంచి రూ.1500ల వరకు ముందుగానే పట్టుకుని మిగితా డబ్బులను ఇస్తున్నారు. అంటే రూ.10వేలు తీసుకుంటే రూ.9వేల నుంచి రూ.8500ల వరకు ఇస్తున్నారన్నమాట. ఈ డబ్బులకు గానూ ప్రతిరోజూ రూ.100 చొప్పున 100 రోజులు వసూళ్లు చేస్తారు. ఇలా దాదాపుగా ఒక్కొక్కరికి రూ.5వేల నుంచి రూ.50వేల వరకు ఇస్తున్నారు.

ఐపీలు పెడుతున్నారు

చీటీల వ్యాపారం చేస్తున్న కొందరు ఈ చీటీల డబ్బులను సొంతానికి వాడుకోవడం, ఆస్తులు, వాహనాలు కొనుగోళ్లు చేయడం, షేర్ మార్కెట్‌లలో పెట్టుబడి పెట్టడం వంటివి చేస్తున్నారు. దీంతో చీటీలు ఎత్తుకున్న వారికి సరైనా సమయంలో డబ్బులు చెల్లించకపోవడం చేస్తున్నారు. రావాల్సిన చీటీ డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి పెంచడం, పోలీసులను, ప్రజాప్రతినిధులను సంప్రదించడం చేస్తే ఐపీలు పెట్టడం, పారిపోవడం వంటివి చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. మరికొని చోట్ల ఫైనాన్స్ పార్ట్‌నర్‌లకే సక్రమంగా ఫైనాన్స్‌కు సంబంధించి లెక్కలు చూపకుండా డబ్బులను సొంతానికి వాడుకుంటూ పలువురు సొంత పార్ట్‌నర్‌లనే మోసం చేయడం, గట్టిగా అడిగితే పారిపోవడం, ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

జిల్లాలో అక్రమ ఫైనాన్స్‌లపై పోలీసుల దాడులు

జిల్లావ్యాప్తంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల పోలీసులు అక్రమ ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్న వారి ఇళ్లలో, కార్యాలయాల్లో మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారం సాగిస్తున్న జిల్లాలోని చాలా గ్రామాల్లో ఈ దాడులు నిర్వహించి 23 కేసులు నమోదు చేయడంతో పాటుగా, పలు ప్రామిసరీ నోట్లు, ఇతర డాక్యుమెంట్లు, నగదు, బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవు

● సంపత్, సీఐ, భిక్కనూరు

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఫైనాన్స్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ఎస్పీ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో పలువురి ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేశాం. భిక్కనూరులో ఇద్దరి వద్ద ప్రామిసరీ నోట్లు, ఇతర డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశాం. అనుమతి లేని ఫైనాన్స్‌ల జోలికి ప్రజలు వెళ్లొద్దు. అక్రమ ఫైనాన్స్‌లు, ఇళ్ల డాక్యుమెంట్లు, ఇతర వస్తువులను కుదువ పెట్టుకుని అధిక వడ్డీలు వసూళ్లు చేస్తున్న వారిపై నిఘా పెట్టాం. గ్రామాల్లో ఇలాంటి వారి వివరాలను తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటాం. వివరాలు ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

ఎమ్మెల్సీ కవిత
భూ కుంభకోణాలు బయట పడుతున్నాయి

- త్వరలోనే కేటీఆర్‌తో పాటు మరికొందరు ముఖ్యనేతలు జైలుకు వెళ్లడం ఖాయం
- ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు కానుంది
- మీడియా సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ వెల్లడి



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కామ్‌తో పాటు మరికొన్ని స్కామ్‌లలో భూ కుంభకోణాలు కూడా బయటపడుతున్నాయని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల తర్వాత కేటీఆర్‌తో పాటు మరికొందరు బీఆర్ఎస్ ముఖ్యనేతలు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌లో చాలా మంది జైలుకు వెళ్తారు. ఫోన్ ట్యాపింగ్‌లో భార్య, భర్తల సంభాషణలు వినడం సిగ్గు చేటన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పోలీసు వాహనాలలో డబ్బులు తరలించడం దారుణమన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి కూడా రైతులను పట్టించుకోలేదన్నారు. కానీ, ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తుందన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని ఆయన తెలిపారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి : కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 13: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో విపత్తు స్పందన, అగ్ని మాపకసేవల శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను, గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముల్లో, షాపింగ్‌మాల్‌లలో ప్రమాదాలు జరగకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్ని మాపకశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపకకేంద్రం అధికారి సయ్యద్ మహ్మద్‌అలీ, లీడింగ్ ఫైర్‌మెన్‌లు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఆపరేటర్లు సాయిబాబా, నరేందర్‌రావు, ఫైర్‌మెన్‌లు స్టాలిన్, శ్రావణ్, రమేష్, జలంధర్, వెంకటి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

అయిలాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత

నందిపేట, ఏప్రిల్ 13: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో పెద్ద మొత్తంలో నిల్వ ఉన్న అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఆదేశాల మేరకు స్థానిక నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ దిలిప్ ఆధ్వర్యంలో ఐయిలాపూర్ గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉప్పరి అనిల్‌కుమార్ ఇంటిని తనిఖీ చేయగా గోవా రాష్ట్రానికి చెందిన రెండు లీటర్ల చొప్పున ఉన్న బెండర్‌స్ప్రైడ్ రెండు బాటిళ్లు, మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంసీ మెగ్‌డెవల్ 35బాటళ్లు, అలాగే ఎంసీపీఎల్ 10.3లీటర్లు, అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన 5.23లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఎంసీ క్వాటర్‌లను సరఫరా చేసిన నిర్మల్ జిల్లా బాసర గ్రామానికి చెందిన అమ్మకంటి రాజుతో పాటు ఐయిలాపూర్‌కు చెందిన ఉప్పరి అనిల్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఇట్టి దాడుల్లో నిజామాబాద్ ఏపీ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో అధికారులు పాల్గొన్నారు. ఎక్కడైనా ఇతర రాష్ట్రాల మద్యాన్ని విక్రయించిన, కొనుగోలు చేసిన కేసులు నమోదు చేస్తామని ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యంను విక్రయిస్తే 8712658973నెంబర్, 18004252523 టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

● నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 13: అగ్ని ప్రమాదాల నివారణకు అప్రమత్తతతో కూడిన ముందు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను, గోడప్రతులను కలెక్టర్ శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు గోదాములలో, షాపింగ్ మాల్‌లలో ప్రమాదాలు జరుగకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు.ఈకార్యక్రమంలో జిల్లాఅగ్నిమాపక కేంద్రం అధికారి మురళీమనోహర్‌రెడ్డి, ఏడీఎఫ్‌వో భీమ్ ప్రనజ్, నర్సింగ్‌రావు,సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌లను శనివారం ఏసీపీ బస్వారెడ్డి ఆవిష్కరించారు. నేటి నుంచి వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని, అగ్ని ప్రమాద నివారణ పద్ధతులను ప్రతీఒక్కరు పాటించి దేశ సంపదను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌వో మధుసూదన్‌రెడ్డి, ఎల్‌ఎఫ్‌లు ప్రకాష్, అనంత్‌రావు, ఎఫ్‌ఎం వంశీ, రాజ్‌కుమార్, విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఇందల్వాయి: అగ్నిప్రమాదాల నివారణకు అప్రమత్తతతో కూడిన ముందు జాగ్రత్తల అవసరం ఎంతైనా ఉందని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని బస్టాండ్, గన్నారం ఫైర్ స్టేషన్ వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్నిప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన గోడప్రతులను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గోదాంలలో, షాపింగ్ మాల్స్‌లలో ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అప్రమత్తంగా ఎలా ఉండాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఫైర్ సిబ్బంది సురేష్, వేణు, జైపాల్, తిరుపతి, సతీష్, మోహన్, అనంత్‌రాజ్, తదితరులు ఉన్నారు.

కేంద్రంలో అధికారంలోకి రాగానే రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ

నవీపేట,ఏప్రిల్13: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేపట్టడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఎరువుల ధరలను పెంచిందని విమర్శించారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా గతంలో బీఆర్‌ఎస్ పార్టీ, బీజేపీ అభ్యర్థులకు అవకాశం ఇచ్చారని ఈ సారి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను ఎంపీగా గెలిచిన తర్వాత బోధన్,బీదర్ లైన్‌ను పూర్తి చేయిస్తానని, బోధన్‌చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తానని,జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు క్వింటాలు పసుపుకు 15వేల ధరచెల్లించే విధంగాచర్యలు తీసుకుంటానన్నారు.అలాగే బీడీ కార్మికులకు రూ.4వేల పింఛన్, యువతకు ఉపాధి కల్పన కల్పిస్తామని హామీ ఇచ్చారు.అలాగే అన్నిరకాల పంటలకు కనీస మద్దతు ధరచెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

● జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి: బోధన్ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టీ.జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 10 సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడి పోయిందని అన్నారు. రాముడి పేరుతో బీజేపీ రాజకీయలు చేయడం శోచనీయమని అన్నారు. మండలంలోని అభంగపట్నం, అబ్బాపూర్(ఎం) గ్రామాల మధ్యన ఎర్రకుంట రిజర్వాయర్‌ను తమ ప్రభుత్వ హయంలోనే చేపట్టం జరిగిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేక అభివృద్ధి పనులను చేపడుతుందని అన్నారు. రాబోయే నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, సునీల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, బాలరాజు గౌడ్, భగవాన్, చల్ల రవీందర్ ఉన్నారు.



నవీపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

ధర్మ రక్షణ కోసం పాటు పడాలి : పిట్ల కృష్ణమహరాజ్

ఎడపల్లి, ఏప్రిల్ 13: ధర్మ రక్షణ కోసం ప్రతీ హైందవుడు పాటు పడాలని మల్లారం లింగేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు పిట్ల క్రిష్ణ స్వామి అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని హనుమాన్ మందిరలో హనుమాన్ దీక్షా స్వాములు హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జన్మ భగవంతుడు ఇచ్చిన అతి పవిత్రమైనదని మానవ జన్మలో సంపాదించిన సంపదలు వెంట రావని భక్తి, పుణ్యం, దానం, ధర్మం మాత్రమే జీవితం వెంట వస్తాయన్నారు. అంతకు ముందు హనుమాన్ మందిరంలో ఎడపల్లితో పాటు వివిధ గ్రామాల హనుమాన్ దీక్ష స్వాములు ఉదయం నుంచి హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణం చేశారు. అనంతరం వివిధ గ్రామాల దీక్షా స్వాములు ఆలపించిన భజన, భక్తి పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. హనుమాన్ దీక్షా స్వాములు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి వివిధ గ్రామాల గురు స్వాములను సత్కరించారు. హాజరైన హనుమాన్ దీక్షా స్వాములకు, గ్రామస్థులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష మండల గురుస్వామి రవిరాజ్, ఎడపల్లి గ్రామ, మండల వివిధ గ్రామాల హనుమాన్ దీక్ష స్వాములు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ మహరాజ్

ఏడాది కావస్తున్నా.. పూర్తి కాని రోడ్డు పనులు

● దోంచంద నుంచి తడపాకల్‌కు నిలిచిన బీటి రోడ్డు పనులు ● ఇబ్బందుల్లో వాహనదారులు

ఏర్గట్ల, ఏప్రిల్ 13: మండలంలోని దోంచంద నుంచి తడపాకల్ వరకు బీటి రోడ్డు పనులు ప్రారంభమై ఏడాది కావస్తోన్న నేటికి పనులు పూర్తి కాకపోవడం. సర్వత్ర విమర్శలకు గుప్పిస్తున్నారు.. దానిపైనే ఆశలు పెట్టుకున్న అక్కడి ప్రాంత రైతులకు ప్రయాణికులు ఇబ్బందులు తప్ప డం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు వేముల ప్రశాంత్‌రెడ్డి దోంచంద నుంచి తడపాకల్ వరకు 3కిలోమీటర్ల 700 మీటర్ల వరకు ఎస్‌సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి రూ.3 కోట్ల 92 లక్షలు మంజూరు చేసి గత సంవత్సరం జనవరిలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిం చారు. అయితే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బీటి రోడ్డు నిర్మాణంలో భాగంగా మట్టి వేసి దానిపై కంకర వేసి అక్కడక్కడ కల్వర్టులు నిర్మాణా లు చేసి చేతులు దులుపుకోవడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. అయితే దోంచంద తడపాకల్ గ్రామాలకు చెందిన రైతులు తమ వ్యవ సాయ క్షేత్రాలకు రోడ్డు పడిందని ఆశతో ఉన్న వారికి నిరాశే ఎదురైంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన కంకర రోడ్డుపై తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు వాహనదారులు కోరుతున్నారు.



దోంచంద తడపాకల్ గ్రామాల మధ్య మట్టి, కంకర వేసిన రోడ్డు

త్వరగా పనులు పూర్తి చేయాలి



దోంచంద నుండి తడపాకల్ వరకు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి కావడం లేదు. రోడ్డుపై కంకర వేయడంతో ప్రయాణీకులకు ఇబ్బందిగా మారింది.వర్షాకాలం రానుండటంతో పంట పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. పనులు వెం టనే ప్రారంభించాలి.

- బెజ్జంకి హన్మంత్ రెడ్డి, దోంచంద

రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తాం

గ్రామస్తుల ఫిర్యాదుల మేరకు త్వరలో రోడ్డు పనులను ప్రారంభిస్తామని అన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్ట్యా ఉన్నతాధికారులకు సమస్యను విన్నవిస్తానని తెలిపారు.పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

-ఆర్అండ్‌బీ అధికారి రోహిత్

యోగాతోనే మానసిక ప్రశాంతత

ముప్కాల్, ఏప్రిల్13: యోగాతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందని, ప్రతీరోజు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని పిరమిడ్ మాస్టర్ బ్రహ్మశ్రీ తటపర్తి వీర రాఘవరావు అన్నారు. శనివారం ముప్కాల్ మండల కేంద్రంలో పిరమిడ్ ధ్యాన మందిర ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యాన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని శాఖహారం భుజిస్తూ ధ్యానం చేసి ఆత్మజ్ఞానం పొందారని ఆయన బోధించారు. విద్యార్థి దశ నుంచే ధ్యానంపై అవగాహన పెంచుకొని ఒత్తిడికి జయించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, దయానంద్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, సత్యనారాయణ, గంగాధ

కమ్మర్‌పల్లిలో కల్లాల్లో తడిసిన ధాన్యం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 13: శనివారం తెల్లవారుజాము నుంచి కమ్మర్‌పల్లి లో కురిసిన చిరుజల్లులకు కల్లాలు రహదారులపై ఆరబోసిన వరిధాన్యం సజ్జలు తదితర పంటలు తడిశాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరబోసిన ధాన్యం కుప్పలపై వాతావరణ మార్పులతో రైతులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాటిపత్రలు కప్పడంతో ధాన్యం తడిసిన దాఖలాలు లేవు అయితే కొన్నిచోట్ల కుప్పలపై కప్పిన తాటిపత్రాలు గాలికి లేచిపోవడంతో వరిధాన్యం తడిసింది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు పడుతూ ఉండగా కొద్ది సేపటి తరువాత జల్లులు నిలిచిపోవడంతో ధాన్యం రాసులపై కప్పిన తాటిపత్రాలు తొలగిచి ఉంచారు. తిరిగి సాయంత్రం మేఘా వృతం కావడంతో మళ్లీ కప్పివేశారు.

మంత్రి, ప్రభుత్వ విప్‌ను కలిసిన ఆగ్రోస్ చైర్మన్



మంత్రిని కలిసిన ఆగ్రోస్ చైర్మన్

కోటగిరి,ఏప్రిల్13: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌లను శనివారం వారి వారి నివాసాలలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు కోటగిరి మండల నాయకులతో కలిశారు. మంత్రి, ప్రభుత్వ విప్‌లను శాలువలతో సన్మానించారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్, పవన్ కుమార్, మధుకర్, మైనారిటీ నాయకులు కాలేక్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ

నవీపేట,ఏప్రిల్13: నవీపేట ఎంపీపీ సంగెం శ్రీనివాస్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో హాజరైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి టీ.జీవన్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే నవీపేట 3 ఎంపీటీసీ డాంగే సతీష్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

విజయ్ కళాశాలలో ప్రాంగణ నియమకాలు

మాక్లూర్, ఏప్రిల్13: మండలంలోని మానిక్‌బండార్ శివారులో గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం హిందుస్థాన్ కోకో కోలా డెవరేజి సంస్థ ప్రాంగణ నియమకాలు చేపట్టింది. ఈ సందర్భంగా సంస్థ హెచ్‌ఆర్ కుమా రస్వామి మాట్లాడుతూ.. సంస్థలో ఉన్న వివిధ ఉద్యోగ అవకాశాలను డిప్లొమా, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులని, ఎంపికైన విద్యార్థులకు సిద్దిపేటలో నూత నంగా నిర్మించిన ప్లాంట్‌లో నియామకం ఉంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లెస్ మెంట్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి అమృతలత, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్, ఏప్రిల్13: మండలంలోని గాంధీనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యా ర్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐఐటీ నీట్ ఫౌండేషన్ ఓలంపియాడ్ పరీక్షలలో 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ మానస గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు, బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమానికి మల్లారెడ్డి యూనివర్సిటీ ఎడప్ మెథ మెటిక్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ శ్రీనాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ లిథియ ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలన అధికారిణి పద్మ, వైస్‌ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

నవీపేట,ఏప్రిల్13: మండల కేంద్రంలో నూతనంగా పునర్ నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరిపె మల్లేష్, మాజీ సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, భవంతి దేవిదాస్, తెడ్డు పోశెట్టి, శ్రీకాంత్ తదితరులున్నారు.

● రామాలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

నవీపేటలో నూతనంగా పునర్ నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శనివారం మధ్యాహ్నం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో భారీ చోరీ

● కిటీకీలు తొలగించి దొంగతనం

● 36 తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 13: రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో భారీ దొంగతనం జరిగింది. బంగారు ఆభరణాలతోపాటు నగదు కూడా దోచుకెళ్లారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో ప్రభుత్వోద్యోగి సాయిరెడ్డి నివాసముంటున్నారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఇటీవలే కొత్తగా ఇంటిని కొనుగోలుచేశారు. గురువారం ఇంటి గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. కార్యక్రమం అనంతరం తిరిగి ఇంటికి వచ్చి నిద్రపోయారు. తెల్లవారుఝామున మొదటి అంతస్తు గదికి బిగించిన కిటీకీలు తొలగించి దొంగలు ఇంటిలోకి చొరబడ్డారు. బీరువాలో దాచిన 36 తులాల బంగారు ఆభరణాలు, లక్షరూపాయల నగదును దోచుకెళ్లారు. విషయం గమనించిన ఇంటియజమాని సాయిరెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దాంతో రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ సిబ్బందితో ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇందల్వాయి, ఏప్రిల్ 13: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారాం తండా సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం ఎల్లారెడ్డిపల్లి గ్రామశివారులోని స్టోన్‌క్రషర్‌లో పనిచేస్తున్న నరేందర్, ఆశీష్, బబ్లు అనే కార్మికులు క్రషర్‌కు చెందిన వాహనంలో డీజిల్ తీసుకువచ్చేందుకు పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా గంగారాం తండావద్ద ముందర ఉన్న లారీని అతివేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుందని అన్నారు. ప్రమాదంలో వాహనం నడుపుతున్న నరేందర్, ఆశీష్‌లకు గా యాలు కాగాబబ్లు (45)మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడని అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. శనివారం తోటి కార్మికుడు మృత్యాల సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

బాలనగర్‌లో మహిళ అదృశ్యం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్13: మండలంలోని బాలనగర్ గ్రామానికి చెందిన గుంజె చిన్నక్క(63) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాలనగర్ గ్రామానికి చెందిన చిన్నక్క శుక్రవారం కొడుకుతో గొడవపడి ఇంట్లో నుంచి బయటకు వెళ్ళి పోయిందని, దీనికి ఇంటికి రాలేదని, ఆమె ఆచూకి కోసం గాలించినప్పటికీ జాడతెలియరాలేదని ఎస్సై తెలిపారు. కొండుకు వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం చిన్నక్క అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.19,500 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం

ఖిల్లా, ఏప్రిల్ 13: నగరంలోని రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల కసాబ్‌గల్లిలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 19,500 రూపాయల నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు ఓ ఇంటిపై తన సిబ్బందితో దాడి చేయగా అనుమానాస్పదంగా ఆరుగురు వ్యక్తులు ఉండటాన్ని గమనించి వారిని సోదా చేయగా పేక ముక్కలు, నగదు లభించిందన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఎంను కలిసిన జక్రాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్13: సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. రాష్ట్ర మున్నూరుకాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షుడు కొండ దేవన్న మాజీసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోర్త రాజేందర్ కలిసి సీఎంను సత్కరించారు. ఈ సందర్భంగా సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం పని చేయాలి

● బాన్సువాడ సొసైటీ చైర్మెన్ ఏర్వల కృష్ణారెడ్డి

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 13: రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం పని చేయాలని బాన్సువాడ సొసైటీ చైర్మెన్ ఏర్వల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు రైతులకు డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కాటా ముగిసిన తర్వాత సొసైటీ నుంచి డీఎం లాగిన్‌కు పంపగానే రైతులకు డబ్బులు వచ్చేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటలు అయినా రైతులకు డబ్బులు చెల్లించడంలేదని మండిపడ్డారు. ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ జరగడానికి డీఎం పాత్ర కీలకమని, కానీ ఇప్పటికీ డీఎం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా కో ఆపరేటివ్ డీసీవో కూడా ముఖ్యమని త్వరలోనే ఈ రెండు పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రారైస్ మిల్లుకు, పారా బాయిల్డ్ మిల్లులకు అలాట్‌మెంట్ చేసిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పారాబాయిల్డ్ మిల్లులకే అలాట్‌మెంట్ ఇవ్వడం సరైంది కాదన్నారు. రా రైస్‌మిల్లులకు కూడా ప్యాడీ అలాట్‌మెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కమిషనర్‌తో మాట్లాడారని తెలిపారు. ఎవరైనా డిఫాల్టర్‌లుగా ఉంటే వారికి కేటాయించకుండా కొత్తగా ఉన్న రారైస్‌మిల్లులకు మాత్రం అలాట్‌మెంట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో రారైస్‌మిల్లుకు, పారాబాయిల్డ్ మిల్లులకు అలాట్‌మెంట్ చేశారని, మరి కామారెడ్డి జిల్లాలో ఎందుకు చేయరని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ఏజాస్ తదితరులున్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 13: మండలంలోని సముందర్ తండా విద్యార్థులకు శనివారం పెద్ద కొడప్‌గల్ పోస్ట్‌మాస్టర్ బేగరి పండరి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పండరి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే, అంబేద్కర్ జయంతిల సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హైమద్‌లు పాల్గొన్నారు.

సీఐని కలిసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 13: బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణను శనివారం తెలంగాణ మలిదశ ఉద్యమకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చందు, ఉడుత గంగాధర్, విజయ్, కృష్ణ తదితరులున్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేస్తాం

● ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 13: నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో ఈపీఎస్.95 పెన్షన్‌దారుల నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్ తెలిపారు. శనివారం ఆయన బాన్సువాడ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో పనిచేసే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఈపీఎస్.95 పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కానీ 25 సంవత్సరాలు గడుస్తున్నా పెన్షన్ మొత్తాన్ని పెంచలేదన్నారు. అంతేకాకుండా ఆర్టీసీ ఉద్యోగులకు పదవీవిరమణ పొందిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి పెన్షన్ సౌకర్యాలు లేవన్నారు. తమను పట్టించుకోని ప్రభుత్వాలకు తమ ఓట్లతో బుద్ధి చెప్పాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్టీసీ రిటైర్మెంట్, ఈపీఎస్.95 పెన్షనర్ల తరపున నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేస్తామని, త్వరలోనే అభ్యర్థిని కూడా ప్రకటిస్తామన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 13: అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అగ్నిమాపక సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫైర్ అధికారి రాజిరెడ్డి, సిబ్బంది రవీందర్‌గౌడ్, లింగం, హరిసింగ్, శ్రీనివాస్ తదితరులున్నారు.



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

మాచారెడ్డి, ఏప్రిల్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని లచ్చపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధి హామీ కార్మికులను కలిసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. మా బడికి రండి అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శరత్, సులోచన, అనురాధ పాల్గొన్నారు.

జుక్కల్‌ను అభివృద్ధి చేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే..

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

నిజాంసాగర్, ఏప్రిల్ 13: 70 సంవత్సరాలు జుక్కల్ అవసరాలను తీర్చని గత ప్రభుత్వాలు, పాలకులు ఎందరో ఉన్నప్పటికీ 10 సంవత్సరాలలో గత బీఆర్ఎస్ హయాంలోనే జుక్కల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఓ చరిత్ర సృష్టించామని మాజీ సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఉమ్మడి మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మహ్మద్‌నగర్‌లోని విండో ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సభాధ్యక్షులు సాదుల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడు తూ 70 ఏళ్ల క్రితం ఎందరో ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించినా ఆ నాడు ఎలాంటి అభివృద్ధి లేకపోయిందన్నారు. తెలంగాణ ఆవిర్భావమై రెండు పర్యాయాలు పని చేసినా అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఎన్నో రంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణలోనే జుక్కల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దార న్నారు. జుక్కల్ నియోజకవర్గంలోనే ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, కామారెడ్డి జడ్పీ చైర్మన్‌గా దఫేదార్ రాజు, దఫేదార్ శోభలు ఇప్పటికీ కొనసాగుతున్నారన్నారు. నా తనయుడిగా దఫేదార్ రాజు ఎదిగి అభివృద్ధి కి కంకణం కట్టుకున్నారే తప్ప ప్రజాస్వామ్యంలో అవినీతికి పాల్పడలేద న్నారు. 2001లో కేసీఆర్ తెలంగాణ పార్టీ ఆవిర్భవించి తెలంగాణ ఉద్యమంలోనే కేసీఆర్‌కు అండగా గాలి అనిల్ కుమార్ పాల్గొన్నారని, గాలి అనిల్ కుమార్‌ను జహీరాబాద్ పార్లమెంటరీ అభ్యర్థిగా ఎంపిక చేసి పంపించారని, అనిల్ కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించి తెలంగాణ జెండా ఢిల్లీలో ఎగురవేసే బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనన్నారు. చేసే పనిలో నిజాయితీ, చెప్పే మాటలో నిజాయితీ ఉంటే దేవుడు మనవైపే ఉంటారని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 134 రోజులు అయిందని, ఈ ప్రభుత్వం ఉద్దెర ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు అమలు కాలేదని, పాలన ఎలా కొనసాగిస్తారో ప్రజలు చూస్తున్నారన్నారు. తప్పుడు హామీలిచ్చిన వారికి పిచ్చిపిచ్చి హామీలు ఇవ్వకుండా పాలన కొనసాగిస్తే ఎంతో బాగుం టుందని, హామీలు నెరవేర్చని కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగితే వాతలు పెట్టాలన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా కొనసాగినా ఎమ్మెల్యే షిండే నియోజకవర్గంలో ప్రజల్లో శభాష్ అనిపించుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ 2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పట్లో ఏమీ హామీలు నెరవేర్చలేదన్నారు. కేవలం 2009, 2014, 2018లో 120 మందిపై అట్రాసి టి కేసులు పెట్టిన ఘనత ఉంది తప్ప, అభివృద్ధికి ఎన్నడూ పూనుకోలేద న్నారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో ప్రతీ చిన్నచిన్న గ్రామాలను గుర్తించి జీపీలు చేయడమే కాకుండా గ్రామాల అవసరాలకు అయ్యే మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. నియోజక వర్గంలో ఎన్నో అభివృద్ధి పథకాలను శిలాఫలాకాలు వేసినా వాటిని కాంగ్రె స్ ప్రభుత్వం పనులు చేయకుండా అడ్డుకుంటున్నారన్నారు. అభివృద్ధి పథకాలు నిలిచిపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి దొంగ హామీలిచ్చారని, రైతులు పింఛన్‌దారులను మోసం చేసి అధికారంలోకి వచ్చారు తప్ప ప్రజా సంక్షేమానికి ఎన్నడూ తోడ్పడలేదన్నారు. మండలాల్లో తెలంగాణ ప్రజా ప్రతినిధులను ఎలా పరపతిని తొక్కేందుకు ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు బెదిరింపులు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని, ప్రజలు తమ వెంటే ఉన్నారన్నారు. ప్రజల సమక్షంలోనే బెదిరింపు పనులు చేసిన వారిని ప్రజా కోర్టులోనే శిక్షించేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. నియోజక వర్గంలో గాలి అనిల్ కుమార్‌కు అధిక మెజార్టీతో గెలిపించేందుకు మాజీ సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేలు కంకణం కట్టుకున్నారని, వారి వెంట ప్రతీ నాయకుడు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో విస్తృత సమావేశంలో పాల్గొన్నారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తే గాలి అనిల్ కుమార్ అధిక మెజార్టీతో గెలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మోహన్ రెడ్డి, కె.నర్సింహారెడ్డి, వాజిద్ అలీ, విఠల్ రెడ్డి, రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు గైని విఠల్, వై.నారాయణ, ఎంపీటీసీలు, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● బీబీ పాటిల్‌కు బాయ్ బాయ్ చెప్పాలి ● కార్యకర్తలను గుండెల్లో పెట్టి కాపాడుకుంటా: ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఏప్రిల్13: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుపునకు ప్రతీ కార్యకర్త పార్టీ కోసం సైనికుల్లా పని చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల, గ్రామ అధ్యక్షుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను కాపాడుకుంటారని, కార్యకర్తలే తన బలం, బలగమని అన్నారు. అదే విధంగా భవిష్యత్తులో మంచి పదవులు పొందుతారని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీతో వచ్చే విధంగా కృషి చేయాలని ఆయన అన్నారు. గత పది సంవత్సరాలుగా ఎంపీగా పని చేసిన బీబీ పాటిల్ అభివృద్ధి చేసింది ఏమి లేదని బీబీ పార్టీలకు బాయ్ బాయ్ చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం మండల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు పాటాకుల వినోద్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు చెన్నా లక్ష్మణ్, చింతల శంకర్, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే



భిక్కనూరులో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న దృశ్యం

15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

భిక్కనూరు, ఏప్రిల్14: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారాం గ్రామానికి చెందిన రాజశేఖర్ టాటాఏస్ వాహనంలో మండలంలోని పెద్దమల్లారెడ్డి నుండి కంచర్ల గ్రామం వైపు అక్రమంగా తీసుకెళ్తుండగా 15.03 క్వింటాళ్ల బియ్యాన్ని పక్కా సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని బియ్యాన్ని జంగంపల్లిలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'కోడ్ ముగియగానే ఆర్టీసీ విలీనం ఉత్తర్వులు'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్13: పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే ఆర్టీసీ కార్మికులు ఎదురుచూస్తున్న ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అపాయింట్‌మెంట్ డేట్ ఉత్తర్వులు రాబోతున్నాయని కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఐఎన్ టీయూసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ హనుమంతుముదిరాజ్ అన్నారు. శనివారం కామారెడ్డి రోటరీక్లబ్‌లోఏర్పాటుచేసిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిధిగ పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి కార్మికుల కోరికలను వివరించగా.. సానుకులంగా స్పందించారని తెలిపారు. కార్మికుల హక్కుల కోసంపోరాడుతూనే సంస్థ పురోభివృద్ధికి ఐఎన్‌టీయూసీపాటు పడుతుందని తెలిపారు. గత సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరంకుశత్వంతో 40మంది ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం కామారెడ్డి కమిటీని ఎన్నుకున్నారు. డిపో సెక్రటరీగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిపో సెక్రటరీగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీయూసీఎస్ డబ్ల్యుయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహ్మద్, డీవీకే రావు, వైస్ చైర్మన్ చీఫ్‌ఎగ్జిక్యూటివ్ మల్లేష్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మవద్దు

● మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 13: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి ఓడిపోయామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శనివారం కామారెడ్డి మండల, రామారెడ్డి మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కులసంఘాలకు రూ.30 నుంచి 40 కోట్లతో పనులుచేయించడం, నాన్‌లోకల్ అంటూ మాయమాటలు చెప్పి బీజేపీ అభ్యర్థి గెలుపొందాడని అన్నారు. రూ.150 కోట్లతో పనులు చేస్తానని మోసపూరిత వాగ్దానాలు చేశాడని ఇప్పటివరకు దాని అమలు లేదని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక కరెంట్ కోతలు మొదలయ్యాయని, ఆరుగ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అమలుచేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నాలుగు నెలల్లో 3ఎకరాల వారికి మాత్రమే 10వేల చొప్పున రైతుబంధు వేశారే తప్ప ఎన్నికల్లో చెప్పినట్లుగా రూ.15 వేలు ఇవ్వలేదని అన్నారు. వర్షాకాలం, యాసంగి పంటలకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 బోనస్ ఇవ్వలేదని అన్నారు. ఢిల్లీ,హైదరాబాద్, ఔరంగబాద్, పూణే తప్ప బీబీపాటిల్‌కు వేరే తెలియవని, పదేళ్లుగా బీఆర్ఎస్‌లో ఎంపీగా అవకాశం ఇస్తే పార్టీకి ద్రోహం చేసి బీజేపీలో చేరారని అన్నారు. ఉద్యమనాయకుడు గాలిఅనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దిన్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, గోపిగౌడ్, రామారెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.



గంగారాం సమక్షంలో బీజేపీలో చేరుతున్న కార్యకర్తలు

పలకరించేవారు లేక కలత చెంది బీజేపీలో చేరా..

● జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం

పెద్దకొడప్‌గల్,ఏప్రిల్13: కాంగ్రెస్ పార్టీలో పలకరించేవారు లేక కలత చెంది బీజేపీలో చేరానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం తెలిపారు. శనివారం పెద్దకొడప్‌గల్ మండలకేంద్రంలో తన స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉన్నా తనను కనీసం అధిష్ఠానం పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం తనకు జుక్కల్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వలేదన్నారు. అయినా కూడా తాను కాంగ్రెస్ పార్టీని వీడకుండా ఉంటే కాంగ్రెస్ పెద్దలు తనను పలకరించడం లేదన్నారు. దీంతో కలత చెంది కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరానన్నారు. ఆయనతో పాటు ఇతర పార్టీల కార్యకర్తలు బీజేపీలో చేరారు.

బీబీ పాటిల్‌ను జహీరాబాద్ ఎంపీగా గెలిపిద్దాం..

జుక్కల్ నియోజకవర్గానికి చెందిన బీబీ పాటిల్‌ను జహీరాబాద్ ఎంపీగా గెలిపిద్దామని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీబీ పాటిల్ ఎంతో సౌమ్యుడని, ఇప్పటికే రెండు సార్లు జహీరాబాద్ ఎంపీగా పని చేసిన అనుభవం ఉందన్నారు. నరేంద్ర మోదీ తిరిగి మూడోసారి దేశప్రధానిగా ఎన్నిక కావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్ రెడ్డి, రామాగౌడ్, బందు పటేల్, మహేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

మద్నూర్, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో ఈనెల 14 నుంచి వారోత్సవాలు ప్రారంభం కానున్న అగ్నిమాపక వారోత్సవ పోస్టర్లను తహసీల్దార్ ముజీబ్ ఆవిష్కరించారు. అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారని అన్నారు. 1944లో ముంబాయిలో జరిగిన దుర్ఘటన తర్వాత అగ్నిమాపక వారోత్సవాలు జరుపుకుంటున్నట్లు గుర్తుచేశారు.

బీజేపీలో భారీగా చేరికలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్13: పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఎంపీ బీబీ పాటిల్ సోదరుడు ఎంబీ పాటిల్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ మండలానికి చెందిన ఐదుగురు మాజీ సర్పంచ్‌లు అమర్ల బండ, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, తిమ్మాజీవాడి మాజీ సర్పంచ్ శంకర్, తిక్కోజీ వాడి మాజీ సర్పంచ్ పీరయ్య, యాచారం మాజీ సర్పంచ్ రమేష్, లక్ష్మీనాయక్, తండా మాజీ సర్పంచ్ మోహన్, బీఆర్ఎస్ నుంచి బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్రమోది ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజే పీ మండలాధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్‌అలీని కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు

దోమకొండ, ఏప్రిల్13: ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీని కామారెడ్డిలోని ఆయన నివాసంలో శనివారం కలసి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపినట్లు జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్, డీసీసీ జనరల్ సెక్రటరీ తాటిపల్లి శ్రీకాంత్ తెలిపారు.అలాగే నాయకులు నాయిం, ఇలీయాస్‌లకు శుభాకాంక్షలు తెలుపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రమేష్, నరేష్, శ్రీధర్, శ్రీనివాస్, మధు, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న షబ్బీర్ అలీ



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భిక్కనూరు, ఏప్రిల్ 14: భిక్కనూరు, బస్వాపూర్ గ్రామానికి చెందిన వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పుర్ర బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్, సోహెల్‌తోపాటుగా పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు జీవన్, బాబు, సుదర్శన్, ఎల్లం, నర్సిం హారెడ్డి, వెంకటేష్, చందు, సిద్దరాములు పాల్గొన్నారు.

● గాంధారిలో..

గాంధారి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తాజా మాజీసర్పంచ్‌లు, సింగిల్ విండో డైరెక్టర్‌లు శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ సంజీవ్,డీసీసీబీ,డీసీఎంఎస్ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, నాగ్లూర్ మాజీ సర్పంచ్ సతీష్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ గణపతి, పోచయ్య, మాజీ సొసైటి వైస్ చైర్మన్ రమేష్‌యాదవ్,నర్సింహులు,సంఘని శివయ్య, పున్నరాజయ్య, కుమ్మరి శంకర్ ఇతర నాయకులు బీఆర్ఎస్‌పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

బీర్కూర్, ఏప్రిల్ 13: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లను శనివారం భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు. స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు వెంకట నరసరాజు అన్నదాన నిర్వహణ కోసం రూ.25వేలు అందజేశారు. రైతునగర్‌కు చెందిన కుసుమ కుమారి వెంకటేశ్వర్లు దంపతులు ఆలయ సన్నిధిలో అన్నదానం నిర్వహించారు. తిమ్మాపూర్‌కు చెందిన దాసరి వెంకటేశ్వర్లు మనుమరాలు కొత్తపల్లి కార్తీక కువైట్‌లో భరతనాట్యం శిక్షణ పొందింది. మొట్ట మొదటి సారిగా ఆలయంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోగవల్లి అప్పారావు, ఢీకొండ మురళీ, సత్యనారాయణ, రవికుమార్, సాయిబాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

మద్నూర్, ఏప్రిల్ 13: మండల బీజేపీ అధ్యక్షుడు తుకారాం ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు ఉచిత బియ్యం పంపిణీ తదితర వాటిపై ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కరోనా సమయంలో టీకాను ప్రజలకు వేసి ప్రమాదం జరుగకుండా చూశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వెంకట్ కాలే, కృష్ణ, సంతోష్, తుకారాం, ప్రశంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - లవ్‌గురు

శాంతి - టిల్ స్క్వేర్

ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్

ప్రియా 35 - గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి - ది ఫ్యామిలీ స్టార్

వెంకటేశ్వర - లవ్‌గురు

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

